ఈనాడు
అల్లూరి సీతారామరాజు
శుక్రవారం 4 అక్టోబరు 2024

భలే భలే బతుకమ్మ సందడి



బతుకమ్మలను ఎత్తుకున్న చిన్నారులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: విలీన మండలాల్లో దసరా ఉత్సవాలంటే మహిళలు, చిన్నారులు బతుకమ్మల తయారీ, ఆటపాటలతో సందడి చేస్తారు. తెలంగాణాలోని ఖమ్మం జిల్లా నుంచి ఈ మండలాలు విడిపోయి, ఏపీలో విలీనమైనా, ఆ సంస్కృతిని కొనసాగిస్తున్నారు. వరరామచంద్రాపురం మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గురువారం కొందరు విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మలు తయారుచేసి, వాటిచుట్టూ కోలాటం ఆడారు. చిన్నారుల ప్రత్యేక వేషధారణ ఆకట్టుకుంది.

పింఛన్ల పంపిణీలో ప్రథమం

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో 1,24,778 మంది లబ్ధిదారులకు గాను 1,24,190 మందికి సామాజిక పింఛను పంపిణీ చేసి 99.53 శాతంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. పంపిణీని నిరంతరం పర్యవేక్షిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మురళి, ఇతర అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అభినందించారు. గత నెలలో కూడా జిల్లా మొదటి స్థానం సాధించిందని గుర్తుచేశారు. కేవలం 688 మందికి వివిధ కారణాలతో పంపిణీ జరగలేదని, సచివాలయ సిబ్బంది మరోసారి కసరత్తు చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

గిరి శిఖరాల్లో కొత్త వెలుగులు

★ అంధకారం నుంచి ఆదివాసీలకు విముక్తి
★ పీఎం జన్‌మన్‌తో ఉచిత సౌర విద్యుత్తు పరికరాలు

ఈనాడు, పాడేరు

ఆదివాసీ కుటుంబాల్లో పీఎం జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్‌మన్) పథకం వెలుగులు నింపుతోంది. ఇన్నాళ్లు అంధకారంలో మగ్గిన గిరిశిఖర గ్రామాల్లో నేడు విద్యుత్తు కాంతులు ప్రసరిస్తున్నాయి. పీవీటీజీ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా ఈపీడీసీఎల్ పరిధిలో 23 వేల పైగా కుటుంబాలకు లబ్ధిచేకూరింది. విద్యుత్తు లైన్లు వేయడానికి అవకాశం లేనిచోట గిరిజన కుటుంబాలకు ఉచితంగా సౌర విద్యుత్తు పరికరాలు, ఉపకరణాలను అందజేస్తున్నారు. అందరికీ విద్యుత్తు.. అంతరాయాల్లేని సరఫరా లక్ష్యంగా ఈపీడీసీఎల్ అడుగులు వేస్తోంది.

తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో పాడేరు, రంపచోడవరం, పార్వతీపురం, సీతంపేట, చింతూరు, కేఆర్‌పురం ఐటీడీఏలు ఉన్నాయి. వీటిలో చాలావరకు గిరిజన గ్రామాలకు విద్యుత్తు సదుపాయం ఉంది. పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణను జీవనోపాధిగా చేసుకుని కొంతమంది కొండశిఖర ప్రాంతాలను ఆవాసాలుగా మార్చుకున్నారు. 10 నుంచి 15 కుటుంబాలు ఒక్కోచోట గూడేలు ఏర్పాటు చేసుకుని బతుకుతెరువు సాగిస్తున్నాయి. వీరి నివాస ప్రాంతాలకు చేరుకోవాలంటే సాహసం చేయాల్సిందే. అలాంటి ప్రాంతాలకు సుమారు రూ.86 కోట్లతో పీఎం జన్‌మన్ పథకం ద్వారా ఇటీవల విద్యుత్తు సదుపాయం కల్పించారు. గిరిజన కుటుంబాలకు ఉచితంగానే విద్యుత్తు కనెక్షన్లు అందజేశారు. ఇప్పటి వరకు ఆరు ఐటీడీఏల పరిధిలో 2,814 పీవీటీజీ గ్రామాల్లోని 22,063 గృహాల్లో విద్యుత్తు కాంతులు నింపారు. ఏళ్లతరబడి అంధకారంలో మగ్గుతున్న గ్రామాలకు ఈ పథకం ద్వారా వందశాతం విద్యుద్దీకరణ పూర్తిచేశారు. ఆయా గ్రామాల సర్పంచులకు గాంధీ జయంతి నాడు జన్‌మన్ ధ్రువపత్రాలిచ్చి సత్కరించారు.



ఇళ్ల ఎదుట ఉచితంగా ఏర్పాటుచేసిన సోలార్ స్టాండ్



పీఎం జన్‌మన్ పథకంలో విద్యుత్తు కనెక్షన్‌కు సంబంధించిన పత్రాన్ని అందజేస్తున్న సిబ్బంది

ఐటీడీఏ	కనెక్షన్లు పొందిన పీవీటీజీ గృహాలు
సీతంపేట	1,279
పార్వతీపురం	3,045
పాడేరు	12,271
రంపచోడవరం	3,936
చింతూరు	332
కేఆర్‌పురం	1,200

★ ఏజెన్సీలో మారుమూల గ్రామాలకు విద్యుత్తు సదుపాయం కల్పించడం సవాల్‌గానే చెప్పాలి. పదిళ్ల కోసం విద్యుత్తు లైన్లు వేయడం ఆర్థికంగానూ భారమే. కేంద్రం సొమ్ములివ్వడంతో అవకాశం ఉన్న కొండ శివారు గ్రామాలన్నింటికీ లైన్లు వేశారు. విద్యుత్తు లైన్లు వేయడం సాధ్యం కాని చోట గిరిజనులకు సోలార్ ద్వారా వెలుగులు అందే ఏర్పాటు చేశారు. ఇటీవలే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున చింతూరు ఐటీడీఏ పరిధిలోని కొండకోనల్లో 103 గృహాలకు రూ.50 వేల విలువ చేసే సౌర విద్యుత్తు పరికరాలు, ఉపకరణాలను ఉచితంగా అందజేశారు. ఇంటి ముందు సోలార్ స్టాండ్ ఏర్పాటు చేసి దాని నుంచి ఇంటిలో రెండు బల్బులు, ఒక ఫ్యాన్, సెల్‌ఫోన్ ఛార్జింగ్ చేసుకునేలా ఓ ప్లగ్ అన్నీ ఉచితంగా సమకూర్చారు. దీపం బుడ్లతో కాలం వెళ్లదీసిన కుటుంబాల్లో జన్‌మన్ పథకం కాంతులు తెచ్చి పెట్టడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. మరో 140 గృహాలకు సోలార్ పరికరాలు ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నట్లు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ 'ఈనాడు'కు తెలిపారు.



విద్యుత్తు లైన్లు వేస్తున్నారిలా...

మన్యం రోడ్లకు మహర్దశ..!

పీఎం జన్‌మన్‌లో రూ.171 కోట్లు మంజూరు

ఈనాడు, పాడేరు

ఏజెన్సీ ప్రాంతాల్లో పీవీటీజీ గ్రామాలకు రహదారి సదుపాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున నిధులు కేటాయించాయి. ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో అల్లూరి జిల్లాలోని 189 కి.మీ పొడవున 85 రహదారుల నిర్మాణానికి రూ.171.93 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చనున్నాయి. అనంతగిరి, డుంబ్రిగుడ, అరకు, కొయ్యూరు, ముంచంగిపుట్టు, చింతపల్లి, గూడెంకొత్తవీధి, పెదబయలు మండలాల పరిధిలోని మారుమూల రహదారులను ఈ నిధులతో అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.101.06 కోట్లు ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.70.86 కోట్లు ఖర్చుచేయనుంది. ఈ రహదారుల నిర్మాణం తర్వాత అయిదేళ్ల పాటు నిర్వహించేందుకు మరో రూ.11.52 కోట్లు వెచ్చించనున్నారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల కంటే పాడేరు ఐటీడీఏకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించడం విశేషం.



వేర్వేరు చోట్ల 575 కేజీల గంజాయి పట్టివేత

రాత్రి 11 దాటాక రోడ్లపై తిరగొద్దు : ఏఎస్పీ



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ధీరజ్

పాడేరు, పెదబయలు గ్రామీణం, ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పాడేరు, చింతపల్లి డివిజన్ల పరిధిలో రాత్రి 11 గంటల తర్వాత ఎవరూ బయట తిరగొద్దని అదనపు ఎస్పీ ధీరజ్ సూచించారు. గంజాయి రవాణా, బైక్‌ల అపహరణ, ఇళ్లలో చోరీ ఘటనల నేపథ్యంలో రాత్రి సమయాల్లో ఎవరైనా రోడ్లపై కనిపిస్తే అదుపులోకి తీసుకుని విచారిస్తామన్నారు. పాడేరులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. చోరీల కట్టడికి ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. వేర్వేరు చోట్ల 475 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ రోగులపేట కూడలిలో ముందస్తు సమాచారంతో వాహన తనిఖీలు చేపట్టి ముంచంగిపుట్టు నుంచి వస్తున్న కారులో తరలిస్తున్న 18 మూటల్లో 455 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.5300 నగదు సీజ్ చేసి ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. ముంచంగిపుట్టు మండలం కించాయిపుట్టు పంచాయతీ నేతాజీ పాఠశాల వద్ద కారులో 120 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. డ్రైవరు కారును వదిలేసి పారిపోయాడని, అందులో ఉన్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నామన్నారు. కొరాపుట్ మార్గంలో గంజాయి రవాణా అధికంగా జరుగుతోందని, ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. పాడేరులో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. జి.మాడుగుల సీఐ, పెదబయలు, పాడేరు ఎస్సైలు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు పట్టించుకోరా?

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏడాదికి పైగా గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా అధికారులకు పట్టడంలేదని రంపచోడవరం మండలం రంప గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. రంపలోని వాటర్‌ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో గ్రామస్థులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో వాల్మీకిపేట, రెడ్డిపేట, దొరపేట.. ఈ మూడు వీధులకు ఒకే తాగునీటి ట్యాంకు ఉందని, ఇదీ పూర్తిగా శిథిలమైందన్నారు. దీంతో కుళాయిలకు చాలీచాలని నీటి సరఫరా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ఏమీపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్న ట్యాంకుకు మరమ్మతులు చేయించడంతో పాటు మరో ట్యాంకును నిర్మించి అందరికీ నీటి సరఫరా జరిగేటట్టు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ ఆందోళనలో ఆకుల జయరామ్, కొమరం బుచ్చిదొర, జర్తా వినోద్ బాబు, బాద రత్నరాజు, చెదల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్యాంకు వద్ద బిందెలతో గ్రామస్థుల ఆందోళన

స్వదేశానికి చేరిన ఒమన్ బాధితురాలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్నానని, ఒమన్‌లోని మస్కట్‌లో పనిచేస్తున్న తనను స్వదేశానికి తిరిగొచ్చేలా ఏర్పాట్లు చేయాలని మండలంలోని సూరంపాలెంకు చెందిన మహిళ పల్లి నిర్మల మంత్రి నారా లోకేశ్‌ను వేడుకుంటున్న వీడియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అయిదు నెలల నుంచి జీతం ఇవ్వడం లేదని, దెబ్బలు తినలేక పోతున్నానని, భారతదేశానికి తీసుకొచ్చేలా ఏర్పాటుచేయమని ఆమె వీడియోలో మొరపెట్టుకున్నారు. దీనిపై ఆమె భర్త రామస్వామి పలువురు ఉన్నతాధికారులకు, ఎన్టీఆర్ భవన్‌లో తెదేపా ఎన్ఆర్ఐ విభాగంలో సైతం ఫిర్యాదు చేశారు. దీనిపై 'లోకేశ్ అన్నా..స్వదేశానికి రప్పించు' అనే శీర్షికతో గత నెల 24న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. పత్రికలో వచ్చిన కథనాన్ని రామస్వామి హైదరాబాద్‌లోని ఏజెంట్‌కు వాట్సాప్ చేశారు. ఈ ఏజెంట్‌కు తన భార్య ప్రయాణ తదితర ఖర్చుల నిమిత్తం రూ.40 వేలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కథనం ఒమన్‌లోని ఏజెంట్‌కు చేరడంతో నిర్మలను సెప్టెంబరు 28న భారతదేశానికి (హైదరాబాద్) పంపేశారు. ప్రస్తుతం ఆమె రాజమహేంద్రవరంలో కుటుంబ సభ్యుల వద్ద ఉన్నారు. స్వదేశానికి నిర్మల రావడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నిర్మలకు ఆరు నెలల జీతం ఇవ్వాలని, అందులో ఒక నెల జీతాన్ని ప్రయాణ ఖర్చులుగా తీసుకుని భారతదేశం పంపారని రామస్వామి అన్నారు. తన భార్యకు రావాల్సిన బకాయి జీతం ఇవ్వాలని ఏజెంట్‌ను ఆయన కోరుతున్నారు.



రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిర్మల



లోకేశ్ అన్నా.. స్వదేశానికి రప్పించు

మస్కట్‌లో బాధితురాలి ఆవేదన

సెప్టెంబరు 24న ప్రచురితమైన కథనం

ఈనాడు కథనానికి స్పందన

పాపికొండల విహారయాత్రకు సిద్ధం

అనుమతుల కోసం నిర్వాహకుల ఎదురుచూపు

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో పాపికొండల విహారయాత్రకు పర్యటక బోట్ల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది జులై 13వ తేదీ నుంచి విహారయాత్రను నిలిపేసిన విషయం తెలిసిందే. దాదాపు 80 రోజులుగా విహారయాత్ర నిలిచిపోవడంతో పర్యటకులు నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం వరద ఉద్ధృతి తగ్గడంతో దేవీపట్నం మండలం గండిపోశమ్మ ఆలయం వద్ద ఉన్న మొత్తం 15 బోట్లను నిర్వాహకులు విహారయాత్ర కోసం సిద్ధంగా ఉంచారు. దసరా సెలవుల నేపథ్యంలో అధికారుల అనుమతుల కోసం వీరు ఎదురుచూస్తున్నారు. గోదావరిలో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 30 మీటర్లు నీటిమట్టం దాటి ఉంటే పాపికొండల విహారయాత్రకు జలవనరుల శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేయరు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 28 మీటర్లు నీటిమట్టం కొనసాగడంతో అనుమతులు ఇవ్వనున్నట్లు సమాచారం. పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి పూడిపల్లి, దేవీపట్నం వరకు జలవనరుల శాఖ అధికారులు ముందుగా గోదావరిలో ట్రైల్ రన్ నిర్వహించి ఆ తర్వాత విహారయాత్రకు అనుమతి ఇవ్వనున్నారు. ఇటీవల వరుస తుపానులు, మారేడుమిల్లి పర్యటక ప్రాంతంలోని జలతరంగిణి వద్ద చోటు చేసుకున్న విషాద ఘటనతో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.



విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

కల్చరల్ ఫెస్ట్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో ఎమ్మెల్యే మత్స్యలింగం, తెదేపా ఇన్‌ఛార్జి దొన్నుదొర, ఇతర ప్రజా ప్రతినిధులు

అరకులోయ, న్యూస్‌టుడే: గిరి విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ముందంజ వేసి భవిష్యత్‌ని ఉన్నతంగా మలుచుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. ఏకలవ్య పాఠశాలల రాష్ట్రస్థాయి కల్చరల్ ఫెస్ట్ గురువారం ఎండపల్లివలప ఏకలవ్య పాఠశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. గిరిజన విద్యార్థుల్లోని ప్రతిభని వెలికితీసి బాహ్య ప్రపంచానికి తెలియజేసేందుకే ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమాన్ని జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర జ్యోతి వెలిగించిప్రారంభించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర, జడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, సర్పంచులు సుస్మిత, దాసుబాబు, గురుకుల పాఠశాలల డిప్యూటీ కార్యదర్శి రమణమూర్తి, ఫెస్ట్ కన్వీనర్ భాస్కరరావు, గురుకులాల కన్వీనర్ పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు

జోరుగా....హుషారుగా.. : ఏకలవ్య పాఠశాలల ఐదో రాష్ట్రస్థాయి కల్చరల్ ఫెస్ట్‌కు రాష్ట్రంలోని 28 ఏకలవ్య పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 32 విభాగాల్లో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చూపే విద్యార్థులు నవంబర్‌లో జార్ఖండ్‌లో నిర్వహించే జాతీయస్థాయి కల్చరల్ పోటీలకు అర్హత సాధించనున్నారు. తొలిరోజు నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్‌లో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు నృత్యాలు, పాటలు, ఏక పాత్రాభినయం తదితరాల్లో పోటీ పడ్డారు.

డిగ్రీ కళాశాల పరిశీలన

అరకులోయ పట్టణం: అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తరగతి గదుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టరు దినేష్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం అరకులోయ వచ్చిన ఆయన అరకులోయ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలలను పరిశీలించారు. డిగ్రీ కళాశాలలో తరగతి గదులు శిథిలస్థితికి చేరడంతో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రిన్సిపల్స్ నాయక్, చలపతిరావు కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లారు. పరిష్కార చర్యలకు ప్రతిపాదనలు పెట్టాలని ఆయన ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సర్పంచి దాసుబాబు, గిరిజన సంక్షేమ ఏఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపల్స్, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు దినేష్‌కుమార్

అదరగొట్టే ఆట.. పతకాల వేట

పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సీబీఎస్ఈ అంతర్ రాష్ట్ర పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. కబడ్డీ, వాలీబాల్ అండర్-14, 17, 19 విభాగాల్లో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి 1200 మంది తమ ఆటతీరుతో మెప్పిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు బాలికలు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ క్రీడలపై ఉన్న ఆకాంక్షలను, భవిష్యత్తు లక్ష్యాలను వివరించారు. ఆ వివరాలివిగో....
– పాయకరావుపేట, న్యూస్‌టుడే


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారిణులు

సమాన ప్రాధాన్యమిస్తున్నాం..



చదువులో ప్రతిభ చూపుతూనే ఆటలకు సమాన ప్రాధాన్యమిస్తున్నాం. కబడ్డీలో గెలుపు సాధించాలంటే చిరుతలా కదలాలి. ప్రత్యర్థి జట్టు వెన్నులో పుట్టేలా వేగవంతమైన కదలికలతో బోల్తా కొట్టించాలి. ఇది సాధించాలంటే కఠోరసాధనే ముఖ్యం. వ్యాయామ శిక్షకుల ప్రోత్సాహంతో విజయాలు సాధిస్తున్నాం. జిల్లా స్థాయి పోటీల్లో బహుమతులు సొంతం చేసుకుంటున్నాం. క్రీడాకోటాలో ఉద్యోగం పొందాలన్నదే ధ్యేయం.
– నాగలలిత, ఎస్.జుహిత, రాజమహేంద్రవరం

జాతీయస్థాయిలో సత్తా చాటాలి



ఆటల్లో జాతీయస్థాయిలో సత్తా చాటాలన్నదే మా లక్ష్యం. మంచి క్రీడాకారిణులుగా పేరు తెచ్చుకోవాలి. దానికోసం అహర్నిశలు కఠోర శిక్షణ తీసుకుంటున్నాం. పతకాల సాధనే మా కోరిక.
– జె.సుష్మ, ఆర్.సుమన, భువనగిరి, తెలంగాణ

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే...



ఆటల్లో ప్రతిభ చూపడంలో కుటుంబసభ్యుల ప్రోత్సాహం కీలకం. వెన్నంటి నడిపిస్తుండటంతోనే వాలీబాల్‌లో సత్తా చాటుతున్నాం. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో వాలీబాల్‌లో ప్రత్యేకంగా తర్ఫీదు తీసుకున్నా. జట్టు విజయంలో ముందుండి నడిపిస్తున్నా. వాలీబాల్ రాణించాలంటే కోర్టులో చురుగ్గా ఉండాలి. మంచి క్రీడాకారిణిగా నిలదొక్కుకోవాలన్నదే నా లక్ష్యం.
– ఎస్.సహస్రరెడ్డి, నెల్లూరు

శ్రమించాల్సిందే



కబడ్డీలో ఆడటం ఆషామాషీ కాదు. ఎంతో శ్రమించాలి. సాధనలో చెమటోడ్చాల్సిందే. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. చదువుకు సమయాన్ని కేటాయిస్తూనే ఆటలో మెలకువలు నేర్చుకున్నాం. ఇబ్బందులు ఎదురైనా ప్రస్తుతం మంచి విజయాలు సాధిస్తున్నాం. రాష్ట్రస్థాయిలో మూడుసార్లు ప్రథమ బహుమతి సాధించాం.
– డి.నవ్యశ్రీ, ఎం.సాయివైష్ణవి, ఖమ్మం

మానసిక దృఢత్వంతోనే...



చిన్నప్పటి నుంచి వాలీబాల్ అంటే ఎంతో ఇష్టం. నిత్యం సాధన చేయడంతో ఆటపై పట్టు సాధించగలిగాం. శారీరక, మానసిక దృఢత్వం క్రీడలతో మన సొంతమవుతుంది. ముఖ్యంగా జయాపజయాలను ఒకేలా తీసుకునే శక్తి అలవడుతోంది. వాలీబాల్‌లో రాష్ట్రస్థాయిలో మూడుసార్లకు పైగా బహుమతులు గెలుచుకున్నాం. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కోరికతో చదువు కొనసాగిస్తున్నాం.
– పి.ఎస్.దీప్తి, బి.ఇక్షిత, అనంతపురం

శిక్షణతో సాధిస్తున్నాం



గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చాం. పాఠశాలలో ఉచితంగా విద్య, వసతి కల్పించడంతో చదువు కొనసాగిస్తున్నాం. ఆటల్లోనూ ప్రతి రోజూ సాధన చేయిస్తున్నారు. దీంతో మిగతా క్రీడాకారులతో సమానంగా సత్తా చాటుతున్నాం. ఆరంభంలో కాస్త బెరుగ్గా ఉండేవాళ్లం. క్రీడలపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. జిల్లా స్థాయిలో బహుమతుల రాకతో మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రతి పోటీలోనూ ప్రతిభ చూపుతున్నాం.
– ఎం.భాను, సీహెచ్.చరిణి, తూర్పుకన్నూరు, తిరుపతి జిల్లా

విజయాలే స్ఫూర్తిగా...



ప్రాంతమేదైనా వాలీబాల్ కోర్టులో దిగామంటే విజయంపైనే మా గురి. విజయాలే స్ఫూర్తిగా దూసుకుపోతున్నాం. వాలీబాల్ ఆడాలంటే శారీరకంగా ఎంతో శక్తి అవసరం. ఒక్కోసారి గాయాలవుతుంటాయి. వీటన్నింటినీ అధిగమించి జట్టు గెలుపునకు అహర్నిశలు శ్రమిస్తున్నాం. అపహాస్యం చేసిన వారే మెచ్చుకునే రీతిలో సత్తా చాటుతున్నాం. మగవారికి దీటుగా మహిళలు ప్రతిచోటా ముందంజలో ఉన్నారు. పోటీ పరీక్షల్లో సత్తా చాటుతాం. ఆటల్లోనూ ప్రత్యేకత నిలుపుకొంటాం.
– ఎం. సంయుక్త, బి.భవ్య, హైదరాబాద్

మరింత ముందుకు అరకు కాఫీ: కలెక్టర్

పాడేరు, న్యూస్‌టుడే: అరకు కాఫీని మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. పాడేరు మినుములూరు కాఫీబోర్డు వద్ద గురువారం ఏడీ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ కాఫీ దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కాఫీ ప్లాంటేషన్ పరిశీలన, కాఫీ బోర్డు ద్వారా అందిస్తున్న రాయితీ పరికరాలు అడిగి తెలుసుకున్నారు. అరకు కాఫీ ద్వారా ప్రతి గిరిజన రైతు లబ్ధి పొందాలని రైతులకు సూచించారు. రైతులు, వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కాఫీపై చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రతి మండలంలో వెయ్యి ఎకరాలకు పైగా కాఫీ, మిరియాల సాగు చేయాలని సూచించారు. కాఫీ బోర్డు ద్వారా రాయితీపై ఇచ్చే నెట్టెలు, మిరియాల ఒలిచే యంత్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అరకు కాఫీ చాలా అద్భుతంగా ఉందన్నారు. కాఫీబోర్డు ఏడీ రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు, 11 మండలాల నుంచి ఎఫ్‌పీఓలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కాఫీ, మిరియాల రైతులు పాల్గొన్నారు.

కాఫీ సేకరణ లక్ష్యం 650 మెట్రిక్ టన్నులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 650 మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డివిజనల్ మేనేజర్ దేవరాజు చెప్పారు. చింతపల్లిలో గురువారం మాట్లాడుతూ.. ఈ ఏడాది ఐటీడీఏ మ్యాక్స్ జీసీసీ సంయుక్తంగా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోందన్నారు. గత ఏడాది కాఫీ ఉత్పత్తులు ఆశాజనకంగా లేనందున 160 మెట్రిక్ టన్నుల గింజలనే సేకరించామన్నారు. ఈ ఏడాదికి సంబంధించి 15 రోజుల్లో అపెక్స్ కమిటీ ధరలు నిర్ణయించనుందన్నారు. నవంబరు నుంచి కాఫీ పండ్ల సేకరణ ప్రారంభమవుతుందని చెప్పారు. కాయలు, పండ్లు కలిపి సేకరించవద్దని, పండ్లు సేకరించిన ఆరు గంటల్లో పార్చిమెంట్ చేసుకోవాలని సూచించారు.

నాలుగు లారీల్లో 230 ఆవులు

స్థానికుల సమాచారంతో అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: గోవులను అక్రమంగా తరలించేందుకు లారీ వెనుక భాగంలో రెండు కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. పరిమితికి మించి ఆవులను ఎక్కించారు. బయటకు కనిపించకుండా టార్పాలిన్లు కప్పేశారు. ఒక్క లారీకి నంబరు ప్లేటు లేదు. నాలుగు లారీల్లో 230 ఆవులు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌కు గోవులను అక్రమంగా తరలిస్తున్న లారీలను పోలీసులు గురువారం అడ్డుకున్నారు. వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో ఒకదాని వెనుక ఒకటి లారీలు వెళ్తుండగా రమేష్ అనే వ్యక్తి మేడపై నుంచి చూసి స్థానిక భాజపా నాయకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన నాయకులు దూది రాజేష్, గొంతిన ఈశ్వరరావు, సయ్యపురెడ్డి మణికంఠ, సీతా నాగరాజు, ముక్కా దేముడుబాబు కూడలికి చేరుకుని అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లకు చెప్పారు. అందరూ కలిసి లారీలను వెంబడించి అడ్డుకున్నారు. వాటిని బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు లారీ డ్రైవర్లు తెలంగాణాకు చెందిన వారు, క్లీనర్లు ఒడిశా, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు చెప్పారు. ఆవులను గోశాలకు తరలిస్తున్నారు.


లారీల్లో ఆవులు

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురంలో తెదేపా సభ్యత్వ నమోదుపై గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. రూ.100 చెల్లించి పార్టీ ద్వారా సాధారణ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. రూ.లక్ష చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం అందిస్తామన్నారు. సభ్యత్వ నమోదులో ఎలమంచిలి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉండాలని కోరారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నారని, తెదేపాలో సభ్యత్వం తీసుకుంటే వేరే పార్టీలకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో సభ్యత్వాలు అధికంగా చేయించి ఎలమంచిలిలో తెదేపా సత్తాను నాయకులకు తెలిసేలా చేయాలని పప్పల కార్యకర్తలకు పిలుపునిచ్చారు.


కార్యకర్తకు సైకిల్ గుర్తును అందజేస్తున్న ప్రగడ, పప్పల, భవాని తదితరులు

తమ పరిస్థితేంటో చెప్పాలి?

తెదేపా అధికారంలోకి వచ్చినా తమలో ఆనందం లేకుండా పోయిందని తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడంలేదని కొందరు నాయకులు, కార్యకర్తలు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే నియోజకవర్గంలో పార్టీ పూర్తిగా బలహీనపడుతుందని విచారం వ్యక్తం చేశారు. కార్యకర్తల బాధలను చెప్పుకొన్నా పరిష్కారం అయ్యే మార్గం కనిపించడం లేదన్నారు. తెదేపాకు కంచుకోటైన ఎలమంచిలి నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులను అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ప్రగడ నాగేశ్వరరావు అందుబాటులో ఉన్నా అధికారం లేకపోవడంతో ఏమిచేయలేకపోతున్నారన్నారు. దీనిపై పార్టీ పెద్దలకు విన్నవించాలని కార్యకర్తలు కోరారు. జడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ లాలం భవాని, తెదేపా రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్‌కుమార్, రంగనాయకులు, సాయిప్రసన్న, బాపునాయుడు, క్రీమ్స్ నాయుడు, తులసీరామ్, జనసేన నియోజకవర్గం తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం భద్రతా తనిఖీలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తూ.కో రైల్వే వాల్తేర్ డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ గురువారం విజయనగరం-రాయగడ - కొరాపుట్ లైన్‌లో భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తాతో పాటు ఇతర సీనియర్ అధికారులతో కలిసి పార్వతీపురం టౌన్, కోమటిపల్లి, రాయగడ, బలుమస్కా స్టేషన్‌లో ఆయన పర్యటించారు. వీటితో పాటు ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. కోమటిపల్లి, రాయగడ, బలుమస్కా స్టేషన్లలో ఈ బృందం ఓవర్ హెడ్ వ్యవస్థలతో పాటు లెవెల్ క్రాసింగ్‌లు, ట్రాక్ సర్క్యూట్‌లపై దృష్టి సారించి పరిశీలించారు. ఇంజినీరింగ్, ఆపరేషన్స్, కమర్షియల్, సేఫ్టీ, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలికాం, ఎలక్ట్రికల్ ట్రాక్షన్ విభాగాలకు సంబంధించిన అధికారులతో కలిసి భద్రతా ప్రమాణాలు, యార్డు పరిస్థితులపై ఆరా తీశారు. పలు చోట్ల ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.


విజయగనరం-రాయగడ సెక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ తదితరులు

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్ట్

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని గర్భవతిని చేసి మోసగించిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విభీషణరావు గురువారం తెలిపారు. నక్కపల్లి మండలం జి.జగన్నాథపురం గ్రామానికి చెందిన కొత్తూరు నాగదేవ ఎస్.రాయవరం మండలంలోని రొయ్యల పరిశ్రమలో క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే కంపెనీలో పనిచేస్తున్న యువతిని ప్రేమ, పెళ్లి పేరుతో లోబర్చుకుని గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి నాగదేవను అడగగా, మొహం చాటేశాడు. దీంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాడుగుల-విశాఖ రహదారి విస్తరణ

80 అడుగులకు ప్రతిపాదనలు


రోడ్డు నిర్మాణ ప్రతిపాదనపై కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి

దేవరాపల్లి, కె.కోటపాడు, న్యూస్‌టుడే: మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాలను విశాఖకు అనుసంధానం చేస్తూ 80 అడుగులకు రహదారి విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ విజయ్ కృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తదితరులతో కలిసి గురువారం విస్తరణ ప్రతిపాదిత మార్గంలో పర్యటించారు. కె.కోటపాడు నుంచి దేవరాపల్లి మండలం కలిగొట్ల, చీడికాడ మండలం అర్జునగిరి మీదుగా మాడుగుల చేరుకున్నారు. ఆయా మండలాల అధికారులు, కూటమి నాయకులతో కలిసి చర్చించారు. ఈ రోడ్డును రెండు దశల్లో నిర్మిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, తెదేపా నాయకులు పైలా ప్రసాదరావు, పీవీజీ కుమార్, మాజీ ఎంపీపీ భాస్కరరావు, శరఖాన సూర్యనారాయణ, నానాజీ, జనసేన నాయకుడు రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై దాడులు'

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై దాడులు చేస్తోందని, ఈ ఆదివాసీ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా గ్రామంలో నృత్యాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా టాన్యా మాట్లాడుతూ 50ఏళ్లగా అరుణోదయ సంఘం పీడిత ప్రజల గొంతుకగా, ప్రజాఉద్యమాలకు అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులుగా ఇల్లా బాలు, ఉపాధ్యక్షులుగా బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా భీమశంకర్, సహాయ కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా ధర్మారెడ్డి, సభ్యులుగా కూర్మారావు, ఆదిరెడ్డి, పోతురాజు, నాగలక్ష్మిలను ఎన్నుకున్నారు. నాయకులు కుంజా దూలయ్య, పల్లాల లచ్చిరెడ్డి, చిట్టిబాబు, అనసూయ పాల్గొన్నారు.


రంపచోడవరంలో అరుణోదయ కళాకారుల బృందం నృత్యాలు

మినీ గోకులాల్లో రూ.5.83 కోట్ల దుర్వినియోగం

ముగ్గురు అధికారులపై అభియోగాలు

ఈనాడు, అనకాపల్లి: పాడి పశువుల సంరక్షణార్థం గత తెదేపా ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన మినీ గోకులాల్లో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. పశుసంవర్ధక శాఖకు చెందిన అధికారులు లబ్ధిదారులతో సంబంధం లేకుండా థర్డ్ పార్టీ ఏజెన్సీకి రూ.కోట్లలో బిల్లులు చెల్లించేశారు. దీనిపై ఫిర్యాదులు అందగా విచారణ నిర్వహించి ముగ్గురు అధికారులను బాధ్యులుగా గుర్తించారు. అప్పట్లో పశుసంవర్ధక శాఖ పాడేరు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన జి.వెంకటస్వామి, అరకులోయ అదనపు సంచాలకులుగా పనిచేసిన డా.అశ్వత్థామ, డుంబ్రిగుడ పశువైద్యాధికారిగా పనిచేసిన జి.గౌతమ్‌ను ఇదివరకే సస్పెండ్ చేశారు. తాజాగా విచారణలో గుర్తించిన అంశాలు ఆధారంగా ఈ ముగ్గురు అధికారులపై అభియోగాలను నమోదు చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం.నాయక్ ఉత్తర్వులిచ్చారు. మినీగోకులాల చెల్లింపుల్లో రూ.5.83 కోట్ల మేర నిధులు దుర్వినియోగం జరిగిందని, వాటికి ఈ ముగ్గురు అధికారుల నిర్లక్ష్యం, సహకారమే కారణమని అభియోగాల్లో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారులకు తెలియకుండా బాలాజీ ఎంటర్‌ప్రైజెస్‌కు ఎందుకు చెల్లించారో పక్షం రోజుల్లోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

గిరిజన సంక్షేమ శాఖ డీడీగా విజయశాంతి

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎ.విజయశాంతిని నియమిస్తూ ఆ శాఖ డైరెక్టర్ భార్గవి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం విజయశాంతి కాకినాడ జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణిగా పనిచేస్తున్నారు. గత నెల 25న డీడీగా విధుల్లో చేరిన కొండలరావును వారం రోజులు గడవకుండానే రిలీవ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చారు. పాడేరు డీడీగా పనిచేసిన సమయంలో డుంబ్రిగుడ మండలం జామిగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. డీడీ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని భావించి విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆ శాఖ డైరెక్టర్ భార్గవి మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

ఆసుపత్రిలో మూడునెలల శిశువు మృతి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఊపిరి అందక ఇబ్బంది పడుతూ అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మూడునెలల శిశువు మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. డుంబ్రిగుడ మండలం అరమ పంచాయతీ గుమ్మగుడ గ్రామానికి చెందిన గొల్లూరి సుశీల, కృష్ణ దంపతుల మూడునెలల బాలుడిని శ్వాస సంబంధిత ఇబ్బందులతో అరకులోయ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఈ చిన్నారి మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సీపీఎం మండల నాయకులు రామారావు పరామర్శించారు.


అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో మృతశిశువుతో బంధువులు, సీపీఎం నాయకులు

శిశుమరణాలపై నిర్లక్ష్యం వీడాలి

శిశు మరణాలు అరికట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఎం నాయకులు రామారావు అన్నారు.. ఏజెన్సీలో పోషకాహారలోపం, ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతోనే శిశు, బాలింత మరణాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఈ వారంలో హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ తుమ్మవలస గ్రామానికి చెందిన గెమ్మెలి చిట్టమ్మకు పుట్టిన బిడ్డ గంటల వ్యవధిలోనే మృతిచెందగా, రక్తహీనతతో బాధపడుతున్న తల్లిని మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందన్నారు. మృతదేహాన్ని శృంగవరపుకోట ఆసుపత్రి నుంచి భర్త కొండబాబు ప్రైవేటు అంబులెన్స్‌లో గ్రామానికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి రేషన్ డిపోల్లో 13 రకాల పోషకాహార సామగ్రిని రాయితీ ధరలపై అందించాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమలో ప్రమాదం..

ముగ్గురు కార్మికులకు గాయాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కేఎన్‌ఆర్‌పేటలోని అల్యూమినియం, ఐరన్ స్ట్రక్చర్స్ తయారుచేసే పరిశ్రమలో గురువారం ప్రమాదం చోటు చేసుకుని ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. దీనికి సంబంధించి గ్రామీణ స్టేషన్ ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. పరిశ్రమలో స్ట్రక్చర్స్ తయారీ అనంతరం దాని సామర్థ్య పరీక్షకు ఇటుకలను వేసి బరువు ఎంత కాస్తుందో పరీక్ష చేస్తారు. ఈ సమయంలో ఇటుకలు జారిపడి అక్కడే ఉన్న కార్మికులపై పడ్డాయి. ఈ ప్రమాదంలో దినేష్, శేఖర్, సాయి అనే కార్మికులకు గాయాలయ్యాయి. వీరిని అనకాపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఆధునికీకరణకు చర్యలు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్తు కేంద్రాన్ని ఒడిశా జలవిద్యుత్తు కార్పొరేషన్ ఉన్నతాధికారుల బృందం గురువారం సందర్శించింది. గతనెల భారీ వర్షాలకు వరదనీరు ప్రాజెక్టులోకి ప్రవేశించి ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒడిశా జలవిద్యుత్తు కార్పొరేషన్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఆశిష్‌కుమార్ మహంతి, గ్రిడ్కో డైరెక్టర్ ఉమాకాంతసాహు, లోడ్‌డిస్పాచ్ సెంటర్ డైరెక్టర్ బి.బి.మెహతా గురువారం మాచ్‌ఖండ్‌కు వచ్చారు. విద్యుత్తు కేంద్రం అధికారులతో మాట్లాడి నీరు ప్రవేశించిన తీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు సమావేశ మందిరంలో ఆంధ్రా, ఒడిశా గ్రిడ్లకు విద్యుత్తు అనుసంధానం, ఫీడర్లలో తలెత్తుతున్న సమస్యలపై ప్రాజెక్టు అధికారులను ఆరా తీశారు. తరచూ ఉత్పత్తికి ఆటంకాలు ఎదురవుతున్న నేపథ్యంలో ఏ విధమైన చర్యలు తీసుకుంటే ముందుముందు సమస్యలు ఉత్పన్నమవకుండా ఉంటాయో చర్చలు జరిపారు. ఇక్కడ ఉత్పత్తయ్యే విద్యుత్తు రెండు రాష్ట్రాలు సమానంగా వినియోగించుకోవడానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. అనంతరం ఉన్నతాధికారులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ త్వరలో విద్యుత్తు కేంద్రం ఆధునికీకరణ పనులు చేపడతామని అన్నారు. ప్రస్తుతం జనరేటర్ల పరీక్షలు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. ఖాళీగా ఉన్న ఒడిశా సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. ప్రాజెక్టు నిధులు పరిసర ప్రాంత అభివృద్ధికి వెచ్చించాలని ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఈ విషయమై ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులతో చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాచ్‌ఖండ్ పర్యవేక్షక ఇంజినీర్ ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు బి.గోవిందరాజులు (జనరేషన్), కురేష్‌ప్రధాన్ (సివిల్), ఉప ఇంజినీర్లు జి.సత్యకిరణ్, బ్రజ్‌సుందర్‌పాడి రాజ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


ప్రాజెక్టు సమావేశమందిరంలో మాట్లాడుతున్న అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

చింతూరు, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని ఆటో, వ్యాన్ డ్రైవర్లకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రహదారిపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదన్నారు. ప్రతీ వాహనానికి అన్నీ పత్రాలు ఉండాలని, సెల్ ఫోన్ నడుపుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎస్ఐ పి.రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


చింతూరులో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ దుర్గాప్రసాద్

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	112	108
లైవ్	134	128
డ్రెస్డ్	194	226
స్కిన్‌లెస్	221	236

అభివృద్ధి పథకాల అమలుపై నివేదికలివ్వండి



ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం ఏడు మండలాల ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీడీలు, గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో పీఓ సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన రహదారులు, జన్‌మన్ పథకం ద్వారా కొండరెడ్డి కులస్థులకు మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్మించిన ఇళ్లకు విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. మైనర్ ఇరిగేషన్ ద్వారా కొత్తగా చెక్‌డ్యామ్‌లను ఎన్ని గుర్తించారు.. పాడైన వాటిలో ఎన్నింటికి మరమ్మతులు చేస్తున్నారు తదితర వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండలాల వారీగా ఎన్ని పనులు చేస్తున్నది ఈ నెల 14వ తేదీ నాటికి నివేదికలను తమకు సమర్పించాలన్నారు. ఏపీవో డీఎన్వీ రమణ, మొబైల్ మేజిస్ట్రేట్ జాన్‌రాజు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ ఐ.శ్రీనివాసరావు, ఎంపీడీవోలు హరికృష్ణ, వీరకిషోర్, మడకం బాపన్నదొర, యాదగిరీశ్వరరావు, ఉపాధిహామీ ఏపీడీ జి.శ్రీనివాసరావు అన్ని మండలాల ఉపాధిహామీ ఏపీవోలు, సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాదారుల ఆందోళన విరమణ

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: అధికారికంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలన్న డిమాండుతో నల్లరాయి, ఇసుక రవాణాదారులు పది రోజులుగా చేస్తున్న ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. పాడేరు డివిజన్ పరిధిలో ఇసుక రీచ్ ఒక్కటీ లేకపోవడంతో గ్రామ పంచాయతీలకు నామమాత్రపు రుసుం చెల్లించి సమీపంలోని గెడ్డల్లో ఇసుకను తరలించేవారు. హుకుంపేట సమీపంలోని మత్స్యగెడ్డను సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. ఇసుక రవాణాకు ఎడ్ల బళ్లనే వినియోగించాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేయడంతో ఇసుక రవాణదారులు ఆందోళనకు దిగారు. కుటమి ప్రభుత్వం నూతన ఇసుక విధానాన్ని దసరా తర్వాత ప్రకటిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర ఇటీవల ప్రకటించారు. అప్పటివరకు ఇసుక రవాణాపై తామేమీ స్పష్టత ఇవ్వలేమని అధికారులు తేల్చి చెప్పడంతో ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు రవాణాదారుల సంఘం పేర్కొంది.

భవిత కేంద్రాల్లో.. డిజిటల్ బోధన



హుకుంపేట భవిత కేంద్రంలో ట్యాబ్‌లో నేర్చుకుంటున్న విదార్థులు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్యంతో పాటు వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో తాజాగా డిజిటల్ విధానంలో బోధిస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి ప్రత్యేక యాప్‌ల ద్వారా సాంకేతిక విద్యపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకుండా యాప్‌ల ద్వారా శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకుండా యాప్‌ల ద్వారా నిఘా పెడుతున్నారు. ఉపాధ్యాయుల బోధన తీరు ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చూస్తున్నారు. విద్యార్థి ప్రగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

మెరుగుపడుతున్న చదువు..

జిల్లాలోని 22 మండలాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 1224 మంది చదువుతున్నారు. ఈ కేంద్రాల్లో విద్య అభ్యసిస్తున్న చిన్నారుల్లో వినికిడి సమస్య, కంటిచూపు సరిగా లేని 41 మంది చిన్నారులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 42 మంది ఉపాధ్యాయులకు అందించారు. చిన్నారులు తమ సమస్యలు అధిగమించేలా ట్యాబ్‌ల్లో 32 యాప్‌లు పొందుపర్చారు. దివ్యాంగ చిన్నారులు చదువుతోపాటు సులువుగా పనులు చేసుకునేందుకు ఇవి ఊతమిస్తున్నాయి. దీంతో చదువులో చిన్నారులు మెరుగుపడుతున్నారు. డిజిటల్ విద్య ద్వారా వంద శాతం ఫలితాలు రావాలని ప్రభుత్వం కోరుకుంటోంది.

నిరంతరం పరిశీలన..



చిన్నారులకు అందించిన ట్యాబ్‌ల్లో గూగుల్ ఫ్యామిలీ లింక్ యాప్ ఉంటుంది. దీని ద్వారా భవిత కేంద్రాలు, బయట జరుగుతున్న బోధనపై నిరంతరం పరిశీలన ఉంటుంది. ఉపాధ్యాయుల బోధన, చిన్నారుల పనితీరు తదితర అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చు. బోధకులకు శిక్షణ ఇచ్చాం. తాజాగా గూగుల్ ఫ్యామిలీ యాప్, ట్యాబ్‌ల వాడకంలో ఏర్పడుతున్న సాంకేతిక ఇబ్బందులపై కూడా అవగాహన కల్పించాం.

– కె.భాస్కరరావు, సహిత విద్య జిల్లా సమన్వయకర్త

అ వీ ఇ వీ

జన్‌మన్ పథకంలో ఇళ్ల మంజూరు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా చింతపల్లి మండలానికి 2665 పక్కా గృహాలు మంజూరయ్యాయని తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు గురువారం తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.3 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మధ్యలో నిలిచిన ఇళ్లను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించిందన్నారు. నాయకులు బేతాళుడు, అప్పారావు, అబ్బాయిదొర, సత్యనారాయణపడాల్, అంద్రాబు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు బస్సు పునరుద్ధరణ

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు - భద్రాచలం బస్సును ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. గత నెల 8న తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గూడెంకొత్తవీధి నుంచి సీలేరు వరకు రోడ్డు దెబ్బతింది. దీంతో 25 రోజులుగా ఈ బస్సు సర్వీసు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఆర్‌అండ్‌బీ అధికారులు పది రోజుల కిందట రహదారికి మరమ్మతు చేశారు. ఈ క్రమంలో విశాఖ డిపో బస్సును గూడెంకొత్తవీధి, సీలేరు మీదుగా భద్రాచలం వరకు గురువారం నడిపారు. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో బస్సు నడుస్తుందని అధికారులు చెప్పారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలి


వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ఎప్పటికప్పుడు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవడం ద్వారా ప్రస్తుత సమాజంలో ముందుంటారని ఏఎస్‌డీఎస్ డైరెక్టర్ గాంధీబాబు వివరించారు. స్థానిక ఏఎస్‌డీఎస్ కార్యాలయంలో గురువారం ఆ సంస్థ ఆధ్వర్యాన చేపట్టిన ఆదివాసీ యూత్ కమ్యూనిటీ లీడర్స్ శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రస్తుత ప్రభుత్వం ఆన్‌లైన్లో ఉంచుతోందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు వీటిపైన అవగాహన తక్కువగా ఉంటుందన్నారు. ఆ సమస్యను అధిగమించడానికే యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పలు పథకాలను ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలో చూపించారు. ఉపాధిహామీ ఏపీవోలు చిరంజీవి, రామగోపాల్, ప్రోగ్రాం మేనేజర్ శ్రీసాయి, చైతన్య, శివశంకర్, మీనా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ ఎంపీడీఓగా లవరాజు



అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎ.లవరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2011 బ్యాచ్‌కు చెందిన గ్రూప్-1 అధికారి. ఆనందపురం ఎంపీడీఓగా పనిచేస్తూ అరకులోయకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన వెంకటేష్ కృష్ణా జిల్లా మచిలీపట్నానికి బదిలీపై వెళ్లారు.

అబ్కారీ సీఐగా ఆచారి బాధ్యతల స్వీకరణ



పాడేరు, న్యూస్‌టుడే: అబ్కారీ శాఖ పాడేరు సీఐగా టీవీవీఎస్ఎస్ ఆచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సంతోష్ అరకులోయకు బదిలీకాగా, విజయనగరం నుంచి పదోన్నతిపై ఆచారి ఇక్కడకు వచ్చారు.

రేషన్ కార్డులను పునరుద్ధరించాలి

అడ్డతీగల, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం షరతుల పేరుతో తొలగించిన ఆదివాసీల రేషన్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు అన్నారు. దుప్పులపాలెంలో ఏఎస్‌పీ మండల అధ్యక్షురాలు కారు అరుణ కుమారి ఆధ్వర్యంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బాబూరావు మాట్లాడుతూ ఆదివాసీలు ఎక్కువ భూమి కలిగి ఉన్నప్పటికీ వర్షాధారంతో పంటలు పండిస్తారన్నారు. సంఘం నాయకులు పీతా ప్రసాదు, మోడిద నేకరాజు, ముర్ల పురుషోత్తం, రాములు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా శరన్నవరాత్రులు ప్రారంభం



పెదబయలులో..



కొయ్యూరులో ఘటాల ఊరేగింపు

రంపచోడవరం, న్యూస్‌టుడే: మన్యం వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రంపచోడవరం స్టేట్‌బ్యాంకు ఎదుట ఉన్న దేవీ ఆలయంలో దుర్గమ్మ గురువారం బాల త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు లింగాల ప్రసన్నకుమార్‌శర్మ, చింతా విఘ్నేశ్వర పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు మోటార్ వర్కర్స్ అండ్ యూనియన్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. స్థానిక మార్కెట్‌వీధి సమీపంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో ఈ నెల 5న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, భర్త మఠం విజయభాస్కర్ దంపతుల చేతులమీదుగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ కమిటీ ప్రతినిధులు బదిరెడ్డి సూరిబాబు, వైవీ రమణయ్య, తిరివీధి వెంకటేశ్వరరావు, వై.నిరంజనీదే తదితరులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెంలోని లక్ష్మీగణపతి దేవాలయంలో స్వర్ణకవచాలంకరణలో, వనదుర్గమ ఆలయంలో బాల త్రిపు సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పోర్‌బే, డొంకరాయి దుర్గమ్మ దేవాలయాల్లో అర్చకస్వాములు కుమార్ స్వామి శర్మ, పవన్ కుమార్, నెమలి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఎటపాక మండలం తోటపల్లిలో..

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వీఆర్‌పురం, రాజుపేట, వడ్డిగూడెం, శ్రీరామగిరి, చింతరేవుపల్లి, రేఖపల్లి, పెద్దమట్టపల్లి తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలకు ముందుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో కనకదుర్గమ్మ వారిని అర్చకులు శాస్త్రోక్తంగా వేదికపై ప్రతిష్ఠించారు. వీఆర్‌పురం కనక దుర్గమ్మవారి ఆలయంలో మూలవరులకు కుంకుమార్చనలు నిర్వహించారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి, దూసరపాము, వట్టిగెడ్డ, జడ్డంగి, చెరుకుంపాలెం, చికిలింత, అమినాబాద్, బడదనాంపల్లి, శరభవరం, కొండపల్లి, లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో దశమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాజవొమ్మంగిలో భవానీ మాలధారుల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎటపాక: తోటపల్లిలో ప్రతిష్ఠించిన అమ్మవారికి ఎటపాక సీఐ కన్నపరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



రంపచోడవరంలో బాల త్రిపుర సుందరీదేవిగా..

హుకుంపేట: హుకుంపేట జీసీసీ డిపో వద్ద దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సుమారు 50 మంది వరకు భవానీ మాలలు ధరించి ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేవి కమిటీ సభ్యులు శివ, శంకర్, రామరాజు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం: చింతపల్లి రంగా కూడలి వద్ద జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, భవానీలు, కమిటీ సభ్యులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

సీలేరు: సీలేరులో దేవీ మండపం వద్ద ఏర్పాటు చేసిన పందిరిలో అమ్మవారి ఉత్సవాలు ఏర్పాటుచేశారు. సీలేరు ఎస్సై జె.రామకృష్ణ, సీఆర్పీఎఫ్ ఇన్‌ఛార్జి సహాయ కమాండెంట్ వీసీహెచ్ పాండే వేడుకలు ప్రారంభించగా, ఏపీ జెన్‌కో ఎస్ఈ (పంప్డ్ స్టోరేజ్) చంద్రశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ చేశారు. సీలేరులో మారెమ్మ, నూకాలమ్మ, వనదుర్గ, ఆంజనేయస్వామి ఆలయాల్లో, ధారకొండలో శరవన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి.



చింతపల్లి రంగా కూడలి వద్ద...



సీలేరులో అమ్మవారికి పూజలు



హుకుంపేటలో ..

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు కొండపైనున్న కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం కనులపండువగా ప్రారంభమయ్యాయి. దుర్గమ్మ విగ్రహాన్ని, ఘటాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఆలయ ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. కలశపూజను విల్లా శివప్రసాద్, సుప్రియ దంపతులతో కృష్ణశర్మ ప్రారంభించారు. సర్పంచి బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు చిరంజీవి, చక్రరావు, రాజశేఖర్, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

పెదబయలు, జి.మాడుగుల: స్థానిక హరిహరపుత్ర మోటారు యూనియన్ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. జి.మాడుగుల సాయిబాబా ఆలయం నుంచి దుర్గమ్మ విగ్రహాన్ని భవానీలు ఊరేగింపుగా తీసుకువచ్చి రెవెన్యూ కార్యాలయ కూడలిలో మండపంలో కొలువుదీర్చారు.

గంగవరం: గంగవరం రాజరాజేశ్వరి ఆలయంలో అర్చకులు సాయిచక్రధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలను మళ్లా నాగేశ్వరరావు, కల్యాణి దంపతులు కలశపూజతో ప్రారంభించారు.



ఎమ్మెల్యే శిరీషాదేవికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న కమిటీ సభ్యులు



రాజవొమ్మంగిలో ఊరేగింపు



గంగవరం రాజరాజేశ్వరి ఆలయంలో..



మోతుగూడెం ఏపీ జెన్‌కో కాలనీలోని కొండపై ..



శ్రీరామగిరిలో అమ్మవారి పూజ

చీడపీడల నివారణలో మెలకువలు



చెరుకుంపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

కొయ్యూరు, న్యూస్‌టుడే: పంటల సాగులో చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారులు సూచించిన మందులనే వాడాలని ఏవో ఉమాదేవి రైతులకు సూచించారు. రేవళ్లు, చీడిపాలెం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో దోమ ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు ఇండక్లోప్రైడ్ 17.8 మందును ఎకరాకు 50 మి.లీ. వాడాలన్నారు. సర్పంచులు వెంకటలక్ష్మి, సోమన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఏవో రమేష్ నాయుడు అన్నారు. చెరుకుంపాలెంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించారు. వరి పొలాలను పరిశీలించి సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కోతుల బారి నుంచి పంట పొలాలను రక్షించేందుకు సోలార్ కంచె వేయించుకోవాలన్నారు. 90 శాతం రాయితీతో గిరిజన రైతులకు అందజేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ పైపులకై పేర్లు నమోదు చేస్తున్నామని, వినియోగించుకోవాలని కోరారు. సర్పంచి డి.నాగేశ్వరరావు, పశువైద్యాధికారి తరుణ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసబాబు అన్నారు. గురువారం కరిముఖిపుట్టు పంచాయతీ తాంగుల, కుమడ పంచాయతీ మూలపుట్టు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగుదారులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక పోషకాలు ఉండే తృణధాన్యాల సాగు, పశుసంపద అభివృద్ధి, కాఫీ, మిరియాల తోటల పెంపకంలో మెలకువలు వివరించారు. సర్పంచి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి గ్రామీణం: రైతులు సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి సూచించారు. అనంతగిరి మండలం మెట్టవలస గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచి జన్ని సన్యాసిరావు హాజరయ్యారు. పశువైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేశారు.

హెల్త్ క్లినిక్ భవనం పూర్తిచేయరూ....



అసంపూర్తి భవనం వద్ద నేతలు, ప్రజలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొమ్మికలో వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. దీనిని పూర్తి చేయకపోవడంతో అద్దె భవనంలో సేవలు అందించాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని సర్పంచి సూరిబాబు, నాయకులు అర్జున్‌రెడ్డి, లోవరాజు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సతీష్, నాగరాజు, లక్ష్మయ్య, నూకరాజు, బాలరాజు గురువారం కోరారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ కిరణ్‌కుమార్‌ను ఉపాధి హామీ, గ్రామ సచివాలయ, మండల పరిషత్తు ఉద్యోగులు గురువారం సన్మానించి వీడ్కోలు పలికారు. కిన్‌కుమార్ సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. మండల పరిషత్తు కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణ హుకుంపేట మండలానికి బదిలీపై వెళ్తుండటంతో ఆయనను కూడా సత్కరించారు. కార్యక్రమంలో మండల ఇంజనీరు మురళీకృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని వినతి



ఉపతహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వార్డు సభ్యుడు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ బూరుగ రెవెన్యూ పరిధిలోని మంగళిగుడను రెవెన్యూ గ్రామంగా గుర్తించాలని వార్డు సభ్యుడు సింహాచలం కోరారు. ఈ మేరకు అనంతగిరి ఉపతహసీల్దార్ మాణిక్యంకు వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ గ్రామంగా ఉంటేనే విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామని విద్యుత్తు సంస్థ అధికారులు చెప్పారన్నారు. రెవెన్యూ గ్రామంగా గుర్తిస్తే తమ గ్రామానికి అన్ని రకాలైన సౌకర్యాలు ఒనగూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు



రింతాడ గ్రామసభలో సమస్యను వివరిస్తున్న గిరిజనుడు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామసభలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. రింతాడ, పెదవలస, వంచుల, మొండిగెడ్డ, జీకే వీధి, లకవరపుపేట పంచాయతీల్లో గురువారం గ్రామసభలు జరిగాయి. తాగునీటి పథకాలు, రహదారులు నిర్మించాలని, అంగన్‌వాడీ భవనాలు, స్త్రీశక్తి భవనాలకు మరమ్మతు చేయాలని పలువురి నుంచి వినతులు వచ్చాయి. ఎంపీపీ కుమారి, వైస్ ఎంపీపీలు ఆనందరావు, సోమేష్‌కుమార్, సర్పంచులు లక్ష్మి, కృష్ణవంశీ, కాసులమ్మ, సుభద్ర, వీరేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, సరస్వతి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోఆర్డీ పాపారావు, కార్యదర్శులు సోమేష్, రాజ్యలక్ష్మి, బాలకృష్ణ, సూర్యపడాల్, బాబూజీ పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో అనర్థాలు



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్థులు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పొగాకు వాడకంతో అనేక అనర్థాలు ఉన్నాయని రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యాధికారులు సుష్మ, ముఖర్జీ అన్నారు. రాజవొమ్మంగిలో గురువారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ పొగాకు నివారణ కార్యక్రమంలో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, జన సంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండాలన్నారు.

అటవీ రేంజ్ అధికారిగా శ్రీనివాసరావు

కృష్ణదేవిపేట: కృష్ణదేవిపేట అటవీ రేంజ్ అధికారిగా గురువారం కె.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన వెంకట్రావు బదిలీపై వెళ్లారు. సీలేరు అటవీ రేంజ్ అధికారిగా పనిచేసిన శ్రీనివాసరావు ఇక్కడకు వచ్చారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, సెక్షన్ అధికారి లక్ష్మణ్, సిబ్బంది ఎరుకులమ్మ, సత్యనారాయణ ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

సీతారాం పోరాటం చిరస్మరణీయం



సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూనవరం, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీతారాం ఏచూరి పోరాటం సాగించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కూనవరంలో గురువారం నిర్వహించిన ఏచూరి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలను జల సమాధి చేసే పోలవరం ఆనకట్ట నిర్మాణంపై ఏచూరి అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా అనేక ఉద్యమాలను ఆయన ముందుండి నడిపించారన్నారు. సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులంతా నివాళులు అర్పించారు. సీపీఎం, సీపీఐ తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: మండలంలోని జాగరంపల్లి నుంచి ఐ.పోలవరం రహదారిలో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– కె.మనోహర్‌దొర, ఐ.పోలవరం

సమాధానం: త్వరలో అన్ని రహదారుల్లో గుంతలకు మరమ్మతులు చేయిస్తాం.

– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, రంపచోడవరం.

?: మారేడుమిల్లి మండలం చావడికోట పంచాయతీ పరిధిలోని బొడ్లంక వద్ద గల పెళ్లిరేవు వాగుపై చిన్న కల్వర్టు ఉంది. వర్షాలు కురిస్తే వాగు రహదారిపై నుంచి ప్రవహిస్తోంది. ఇక్కడ పెద్ద వంతెన నిర్మించడానికి చర్యలు చేపట్టాలి.

– సాదల ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సర్పంచి, చావడికోట

✓: పెళ్లిరేవు వాగుపై పెద్ద వంతెన నిర్మించాల్సిన అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– వెంకటరమణ, మండల ఇంజినీరింగ్ అధికారి, మారేడుమిల్లి

ఎమ్మెల్యే చొరవతో ధ్రువపత్రాలు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వీఆర్‌పురం బీసీ కాలనీకి చెందిన గేదెల మంగమ్మ కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ఏడాదిపైగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోలేదు. వారం రోజుల క్రితం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే శిరీషాదేవి దృష్టికి ఈ సమస్యను ఆమె తీసుకు వెళ్లారు. మంగమ్మకు కుల, ఆదాయ ధ్రువపత్రాలను గురువారం తహసీల్దార్ అందించారు. ఎమ్మెల్యే చొరవతో తన సమస్య పరిష్కారమైందని మంగమ్మ సంతోషం వ్యక్తం చేశారు. అర్హులై సంక్షేమ పథకాలు అందని వారికి, వరదలకు నష్టపోయిన వారికి న్యాయం చేయాలని జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, తెదేపా సీనియర్ నాయకులు ముత్యాల రామారావు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఇన్‌ఛార్జి తహసీల్దార్ సుబ్బారావును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వడ్డిగూడెం పంచాయతీలోని బీసీ కాలనీ వాసులకు వరదల జీవనభృతి కల్పించాలని విన్నవించారు. తెదేపా మండల అధ్యక్షులు ఆచంట శ్రీను, బొర్రా నరేశ్, నరసింహరావు, చంద్రశేఖర్, రంగాచారి, ప్రకాశరావు, కోట్ల బాలయ్య పాల్గొన్నారు.



మంగమ్మకు ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

అసంపూర్తి పనులతో అవస్థలు



పేటమాలిపుట్టు సమీపంలో నిలిచిపోయిన వంతెన నిర్మాణం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: దారెల పంచాయతీ పేటమాలిపుట్టు గ్రామ సమీపంలో ఉన్న వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణం నిలిచిపోవటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కిలగాడ కూడలి నుంచి పెదపేట మీదుగా కుమ్మరిపుట్టు, తలింబా, డీంగుడ, మురళిపుట్టు గ్రామాలతోపాటు పెదగుడ పంచాయతీలోని గ్రామాలకు వెళ్లే మార్గంలో పేటమాలిపుట్టు సమీపంలో ఆరు నెలల కిందట వంతెన నిర్మాణ పనులు ఆరంభించారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేయక రెండు పంచాయతీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వంతెనకు ఆనుకుని నిర్మించిన మళ్లింపు మార్గం వానొస్తే బురదమయమై వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే 20 గ్రామాలకు రోడ్డు సదుపాయం మెరుగుపడుతుంది.